సాక్షి
పార్వతీపురం మన్యం
గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



అభివృద్ధిని అడ్డుకోవడం తగునా..?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన పనులను నిలిపివేయడం తగదని పీడిక రాజన్నదొర అన్నారు. - 8లో



పీహెచ్‌సీ వైద్యుల నిరసన

ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల్లో వైద్యులు ఉద్యమబాట పట్టారు. - 8లో



సేవలను సద్వినియోగం చేసుకోవాలి

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్‌శాఖ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ తదితరులు

పాలకొండ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 17న పాలకొండలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 20 కంపెనీల నుంచి ప్రతినిధులు ఎంపికలు చేపడుతున్నారని తెలిపారు. సత్యసాయి కళాశాల ఆవరణలో నిర్వహించే ఈ జాబ్‌మేళాను యువత వినియోగించుకోవాలని కోరారు.

మారిషస్ పైనాపిల్ మొక్కల పంపిణీ



మారిషస్ రకం పైనాపిల్ పంపిణీ చేస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో దిబ్బగూడ, కీసరజోడు రైతులకు మారిషస్ రకం పైనాపిల్ మొక్కలను ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కొత్తరకం పైనాపిల్‌ను భామిని, సీతంపేట మండలాల్లో పరిచయం చేస్తున్నామన్నారు. ఇక్కడ సక్సెస్ అయితే మిగతా మండలాలకు విస్తరింపజేయనున్నామన్నారు. ఎస్‌సీఏ, టీఎస్‌ఎస్ పథకం కింద 90 శాతం రాయితీపై వీటిని ఇస్తున్నామని తెలిపారు. ఒక్కో రైతుకు ఎకరాకి 8 వేల పైనాపిల్ అవసరమవుతుందన్నారు. వీటి సాగుతో అధిక ఆదాయాలను పొందవచ్చన్నారు. మొత్తం 110 ఎకరాల్లో సాగు చేయించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, పీహెచ్‌ఓ గణేష్, హెచ్‌ఓ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జూనియర్స్ టెన్నీకాయిట్ జట్టు ఎంపికలు రేపు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న సబ్ జూనియర్స్ టెన్నీకాయిట్ బాల, బాలికల పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 13న నిర్వహించనున్నట్టు జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.రామారావు బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి నగరంలోని రాజీవ్ స్టేడియంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో 2010 ఏప్రిల్ 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు అర్హత సాధించిన క్రీడాకారులు ఈ నెల 14నుంచి 16 వరకు శ్రీకాకుళం జిల్లా పలాసలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్టు వివరించారు.

వరద బాధితులకు వైద్యుల సాయం

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలో భారీ వర్షాలు కారణంగా నష్టపోయిన వరద బాధితులకు నగరంలోని ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు విరాళాలు అందించారు. ఈ మేరకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు బుధవారం అందజేశారు. కాష్వి ఆస్పత్రి వైద్యులు రూ.50 వేలు, ఆంధ్రా చిల్డ్రన్ ఆస్పత్రి రూ.25 వేలు, గాయిత్రి ఆస్పత్రి రూ.25 వేలు, వెంకటరామ ఆస్పత్రి రూ.25 వేలు, స్వామి కంటి ఆస్పత్రి రూ.25 వేలు, మారుతి ఆస్పత్రి రూ.25 వేలు, సాయి పీవీఆర్ ఆస్పత్రి రూ.15 వేలు, ఎస్.కోట అభినవ్ ఆస్పత్రి రూ.15 వేలు, కొలపర్తి ఆస్పత్రి రూ.15 వేలు, సాయి కృష్ణ ఆస్పత్రి రూ.15 వేల చెక్కులను అందజేశారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణి అన్నారు. స్థానిక వ్యాస నారాయణ మెట్ట కాలనీలో హెచ్‌ఐవీపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. హెచ్‌ఐవీ రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఐవీ రోగుల పట్ల వివక్ష చూపకూడదని సూచించారు. హెచ్‌ఐవీ సోకిన వారు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఏఆర్‌టీ కేంద్రం వద్ద మందులు వాడి మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా జీవిత కాలాన్ని పెంచుకోవచ్చునని చెప్పారు. హెచ్‌ఐవీ అంటువ్యాధి కాదని అన్నారు. హెచ్‌ఐవీపై ఎటువంటి అపోహలు ఉన్నా టోల్ ఫ్రీ 1097 నంబర్‌కి కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఐసీటీసీ జిల్లా సూపర్‌వైజర్ సాక్షి గోపాల్‌రావు, ప్రాజెక్టు మేనేజర్ గౌరీ పాల్గొన్నారు.

ఆపన్న హస్తం

- హామీ నెరవేర్చి అండగా నిలబడిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఎసైన్షియా ప్రమాద బాధిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ఆర్థిక సాయం
- ముగ్గురు మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున అందజేత
- ఇద్దరు క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున సాయం

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

కష్టంలో ఉన్న కుటుంబం ఎక్కడున్నా నేనున్నానంటూ ఆపన్న హస్తం అందించడంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుంటారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ఒక అన్నలా, ఒక కొడుకులా విధి వంచిత కుటుంబాలకు ఆర్థికంగానూ అండగా నిలుస్తున్నారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికులు ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబాలను ప్రభుత్వం ఎలా ఆదుకోవాలో ఎల్‌జీ పాలిమర్స్ ఘటనతో నిరూపించిన సంగతి తెలిసిందే. దేశ చరిత్రలో తొలిసారిగా ఒక్కో మృతుడి కుటుంబానికి రూ.కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించి సంచలనం సృష్టించారు. ఇప్పుడు అదే విధానాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా పాటించక తప్పలేదు. ఇటీవల అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ అనే పేరున్న ఫార్మా పరిశ్రమలో చోటుచేసుకున్న పేలుడు దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు అదే స్థాయిలో పరిహారం ప్రకటించిన సంగతి తెలిసిందే. నాడు ప్రమాదస్థలిలో బాధిత కుటుంబాలను ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మనోధైర్యం నింపారు. ఆ హామీ ప్రకారం మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఆ మొత్తానికి సంబంధించిన చెక్‌లను పార్టీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్టీ సీనియరు నాయకులు పీడిక రాజన్నదొర, అలజంగి జోగారావు, పరీక్షిత్‌రాజు, బద్దుకొండ అప్పలనాయుడు చేతుల మీదుగా అందించారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నివిధాలా తమకు అండగా నిలబడి తమకు మనోధైర్యం నింపారని ఆయా కుటుంబాలు చెబుతున్నాయి.



మజ్జి శ్రీనివాసరావు తదితర వైఎస్సార్‌సీపీ నాయకుల నుంచి చెక్ అందుకున్న జవ్వాది కోటేశ్వరరావు

మా కుటుంబాన్ని ఆదుకున్నారు...

మా కుమారుడు జవ్వాది పార్థసారథి ఆగస్టు 21న అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. మా కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడం చాలా బాధను కలిగించింది. మా కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాకు రూ.5 లక్షల చెక్‌ను పార్టీ నాయకుల ద్వారా అందజేశారు. అధికారంలో లేకపోయినా పేదలు అంటే అభిమానంతో ఆయన మాకు ఆర్థిక సాయం చేశారు. ఆయన చేసిన సాయం మా కుటుంబ సభ్యులు మరువలేము. ఆయనకు రుణపడి ఉంటాం.

–జవ్వాది కోటేశ్వరరావు, పార్థసారధి తండ్రి, చలమవలస గ్రామం, పార్వతీపురం.

తగిన పరిహారం ఇప్పించారు...



ఎసైన్షియా పరిశ్రమలో జరిగిన దుర్ఘటనలో నా భర్త ఆనందరావును కోల్పోయాను. కుటుంబానికి పెద్ద దిక్కుగా నడిపించే ఆయనే లేరంటే మా పరిస్థితి ఏమిటో మాకే అర్థంకాలేదు. కుటుంబం అంతా రోడ్డున పడిపోయాం. ఇలాంటి దిక్కుతోచని పరిస్థితుల్లో మాలాంటి బాధితుల తరఫున వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబడ్డారు. ప్రభుత్వాన్ని డిమాండు చేసి తగిన పరిహారం ఇప్పించారు. అంతేకాదు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందించారు. పెద్ద మనసుతో ఆదుకొన్న జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– బమ్మిడి సత్యవతి, ఆనందరావు భార్య, పూసపాటిరేగ

కష్టాల్లో ఆదుకున్నారు..



నా పేరు చందక బంగారు నాయుడు. నాది గుర్ల మండలంలోని చిన్న నాగళ్లవలస గ్రామం. నేను ఎసైన్షియా ఫార్మా కంపెనీలో పని చేస్తున్నాను. అక్కడ జరిగిన ప్రమాదంలో నాకు గాయాలయ్యాయి. బాధితులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ప్రకటించిన జగన్‌మోహన్‌రెడ్డి ఆ మాటను నిలబెట్టుకున్నారు. నాకు రూ.లక్ష చెక్కును జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఈ ఆర్థిక సాయంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు లేకుండా అయ్యింది. వైద్యం చేయించుకోవడానికి ఇతరులను అడగకుండా ఉపయోగపడింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

జగన్‌మోహన్‌రెడ్డి సాయం మర్చిపోలేం..



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి మా కుటుంబానికి అందించిన సాయాన్ని ఎప్పటికీ మరచిపోలేం. నా భర్త మహంతి నారాయణరావు అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మరణించారు. మా కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. నా బిడ్డ తండ్రి లేని అనాథయ్యాడు. ఇలాంటి సమయంలో అధికారంలో లేకపోయినా, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డి రూ.5లక్షలు అందజేసి మా కుటుంబానికి భరోసా అందించారు.

– మహంతి స్వాతి, నారాయణరావు భార్య, అర్థమూరు, గరివిడి మండలం

జగన్ బాబుకు రుణపడి ఉంటాం



అచ్యుతాపురం సెజ్‌లో మా అబ్బాయి గెద్ద సంతోష్ సుమారు ఆరేళ్ల నుంచి పని చేస్తున్నాడు. ఇటీవల ఎసైన్షియా కంపెనీలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దేవుడి దయతో పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. మొన్నటి వరకు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. పరిస్థితి కాస్తా కుదుట పడటంతో ప్రస్తుతం డిశ్చార్జ్ ఇచ్చారు. ఈ కష్ట కాలంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయాన్ని అందించడం ఆనందం కలిగించింది. నేరుగా ఇంటికే ఆయన ప్రతినిధులను పంపించి రూ.లక్ష చెక్కు అందజేశారు. ఆయన గొప్ప మనసుకు నా కుటుంబం తరఫున ధన్యవాదాలు చెబుతున్నాను.

– గెద్ద వెంకటరమణ, సంతోష్ తండ్రి, పారసాం, నెల్లిమర్ల మండలం

అభివృద్ధి కుంటుపడితే కఠిన చర్యలు

- ఎంపీడీఓలపై కలెక్టర్ ఆగ్రహం
- లక్ష్యాలు సాధించని హౌసింగ్ సిబ్బంది జీతాలు నిలిపేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: మండలాల్లో అభివృద్ధి కుంటుపడితే సంబంధిత ఎంపీడీఓలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ హెచ్చరించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో వెనుకబడిన ఎంపీడీఓలను, ఇతర అధికారులను సహించేది లేదన్నారు. సెప్టెంబర్ నెలలో లక్ష్యాలు సాధించని హౌసింగ్ ఏఈలు, ఇంజినీరింగ్ సహాయకుల జీతాలు నిలిపివేయాలని ఆదేశించారు. వివిధ మండల శాఖల అధికారులతో బుధవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. లక్ష్యాల సాధనలో వెనుకబడ్డ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పరిస్థితి మెరుగుపడే వరకూ సూపర్ శానిటేషన్ పనులను కొనసాగించాలన్నారు. తాగునీటిని నిత్యం క్లోరినేషన్ చేసి సురక్షిత జలాన్ని అందించాలని ఆదేశించారు. సెప్టెంబర్ 20 నాటికి జిల్లాలోని 620 ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్లను వినియోగంలోకి తేవాలన్నారు. ఉపాధి పనులను వేగవంతం చేయాలన్నారు. ఉపాధి పనులకు సంబంధించి ఈ నెల 14లోగా అన్ని మండలాల నుంచి తీర్మానాలను తీసుకోవాలన్నారు. ఉపాధి పనులను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఎంపీడీఓలపై ఉందని చెప్పారు. వర్షం వల్ల నష్టపోయిన ప్రతీ ఒక్కరికి న్యాయం జరిగే విధంగా సర్వే చేసి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఓటర్ల నమోదుకు సంబంధించి ఇంటింటా సర్వే త్వరగా పూర్తి చేయాలని నియోజకవర్గ ఆర్‌ఓలను జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. సమావేశంలో సీపీఓ బాలాజీ, జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా, వ్యవసాయ శాఖ జేడీ తారకరామారావు, డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

‘గురుదేవా’ సేవలు ప్రశంసనీయం

- ప్రతీ ఒక్కరు సేవాభావం అలవర్చుకోవాలి
- ఎస్పీ వకుల్ జిందల్



కృత్రిమ అవయవాల తయారీని ఎస్పీకి వివరిస్తున్న ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామ సమీపంలో గల శ్రీగురుదేవా చారిటబుల్ ట్రస్టు దివ్యాంగులకు, అభాగ్యులకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ట్రస్టు 27వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన బుధవారం ట్రస్టును సందర్శించారు. ముందుగా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కృత్రిమ అవయవాల తయారీ యూనిట్, సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన 27 సంవత్సరాలుగా సుమారు రెండు లక్షల ముప్పై వేల మంది దివ్యాంగులకు ఉపకరణాలను అందించి నడిపించిన గురుదేవా సేవలు అజరామరం అన్నారు. ప్రస్తుత రోజుల్లో వీధికోక ఎన్‌జీఓ సంఘాలు ఏర్పడుతున్నాయి తప్ప సేవా కార్యక్రమాలు నిర్వహించడం లేదని, అతి కొద్ది సంస్థలు మాత్రమే విరివిగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయన్నారు. గురుదేవా చారిటబుల్ ట్రస్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటూ మరో ఐదు రాష్ట్రాల్లో తమ సేవలను విస్తరించడం అభినందనీయమన్నారు. ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు దివ్యాంగుల పాలిట ఆపద్బాంధువులా ఆదుకుంటున్నారన్నారు. ఆయన ఎందరో దివ్యాంగులను నడిపించడమే కాకుండా ఉపాధి అవకాశాలను కల్పిస్తూ వారికి చక్కటి భవిష్యత్‌ను ఇస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. సేవలు పొందిన వారు మరొకరికి సేవలు అందించే స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం పలువురు దివ్యాంగులకు ట్రైసైకిల్స్, వినికిడి యంత్రాలు, కృత్రిమ కాళ్లు, చేతులు, వీల్‌ఛైర్స్ అందజేసారు. పేదలకు బియ్యం తదితర వస్తువులను ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో సీఐ షణ్ముఖరావు,, ట్రస్టు ఉపాధ్యక్షుడు ఫణీంద్ర, వైద్యులు రాఘవేంద్ర, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగాలి



ర్యాలీలో పాల్గొన్న అటవీ శాఖ సిబ్బంది

విజయనగరం పూల్‌బాగ్: విధి నిర్వహణలో అసువులు బాసిన అటవీ అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగాలని జిల్లా అటవీ అధికారి ఎస్ వెంకటేష్ పిలుపునిచ్చారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పూల్‌బాగ్‌లోని అటవీ శాఖ కార్యాలయంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు బి.అప్పలరాజు, త్రినాధరావు, ఆర్.రాజాబాబు, డీఆర్‌ఓ, ఎఫ్‌ఎస్‌ఓ కెవిఎన్.రాజు, ఎఫ్‌బీఓలు శ్రీను, రామారావు, రాజేశ్వరి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వీడీవీకే ఉత్పత్తులను మార్కెటింగ్ చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: వన్ ధన్ వికాస్ కేంద్రాల(వీడీవీకే) ద్వారా ఉత్పత్తి చేసిన వస్తువులకు మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో జీవనోపాధుల కార్యక్రమంపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన బుధవారం సమీక్షించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలకు కావాల్సిన వస్తువులను వీడీవీకే, స్వయం సహాయక సంఘాల ద్వారా సరఫరా చేయాలన్నారు. వీడీవీకేలను సంఘటిత రంగంగా తీర్చిదిద్దాలని డీఆర్‌డీఏ పీడీని ఆదేశించారు. మహిళలకు ఆసక్తి గల అన్ని రంగాలలో శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గుమ్మలక్ష్మీపురం వైటీసీలో 30 మందికి కుట్టుమిషనులు, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ కోసం అభ్యర్థులను ఎంపిక చేయాలన్నారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కింద సవర కళలలో శిక్షణ ఇవ్వడం జరిగిందని, శిక్షణ అనంతరం వారు రూపొందించిన కళా ఖండాలకు మార్కెటింగ్ అవకాశాలను కల్పించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్‌ఎస్.శోభిక, ఇన్‌చార్జ్ డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి.కరుణాకర్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ జెఎల్ఎన్.మూర్తి, నాబార్డ్ అభివృద్ధి అధికారి దినేష్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కలిగించాలి

పార్వతీపురం: ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వైద్యాధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న బాలికలందరికీ రక్తహీనత పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఎనిమీయా రహిత జిల్లాగా మార్చాలన్నారు. ప్రతీ ప్రసవం ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. మాతృ మరణాలు నివారించాలన్నారు. మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి గంబూషియా చేపలను వదిలి పెట్టాలన్నారు. సికెల్‌సెల్ కార్డులు పంపిణీ పూర్తి చేయాలన్నారు. సికెల్‌సెల్ కార్డుల వినియోగంపై మరింత అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి కె.వి జయపార్వతి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, డీఈఓ జి.పగడాలమ్మ, డీఎల్‌ఏటీఓ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వదలని జ్వరాలు

- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- కొన్ని పీహెచ్‌సీల్లో మందుల కొరత?
- ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంల నియామకంపై అటకెక్కిన మంత్రి హామీ!



భద్రగిరి ఆస్పత్రిలో జ్వరపీడితులు

సాక్షి, పార్వతీపురం మన్యం/గుమ్మలక్ష్మీపురం: జిల్లాను జ్వరాలు వదలడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలతో.. వాతావరణం మారడం, నీరు కలుషితం కావడం... మరోవైపు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారవడంతో వ్యాధులు మరింత విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో ప్రతి ఇంటా జ్వర పీడితులే కనిపిస్తున్నారు. విష జ్వరాలు, డెంగీ, మలేరియా బాధితులతో ప్రభుత్వ, ప్రైవేట్ అనే తేడా లేకుండా ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఈ సీజన్‌లో వందల మంది ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు జ్వరాల బారిన పడ్డారు. ముగ్గురు పైగా విద్యార్థులు మృతి చెందడంతో పాటు.. జియ్యమ్మవలస మండలంలో ఇటీవలే తల్లీకూతుళ్ల మృత్యువాత పడ్డారు. సాలూరు మండలంలోని తోణాం గ్రామంలో కొద్ది రోజులుగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంటిలోనూ జ్వరపీడితులు కనిపిస్తున్నారు. జిల్లా ఆస్పత్రికి జ్వరం, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులతో బాధపడుతూ వస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంటోంది.

మలేరియాకు మందుల్లేవు

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1,272కు పైగా మలేరియా, 63 డెంగీ కేసులు నమోదయ్యాయి. మొత్తం 37 పీహెచ్‌సీల పరిధిలో చూసుకుంటే.. ఏజెన్సీ ప్రాంతంలోని 20 పీహెచ్‌సీలకే మలేరియా కేసులు అధికంగా వస్తున్నాయి. కొన్ని పీహెచ్‌సీల్లో సరిపడా మందులు ఉండటం లేదు. భద్రగిరి ఆస్పత్రిలో మలేరియా రోగులకు వైద్యులు మందులు రాసిచ్చి.. బయటే కొనుగోలు చేసుకోవాలని చెబుతున్నారు. ఇదే పరిస్థితి మరికొన్ని ఆస్పత్రుల్లోనూ ఉంది.

అటకెక్కిన మంత్రి గారి హామీ!

వర్షాల సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఏజెన్సీలోగానీ, ఆశ్రమ పాఠశాలల్లోగానీ దోమ తెరల పంపిణీ జరగలేదు. జిల్లాలో 3.80 లక్షలకు పైగా దోమ తెరలు అవసరం అవుతాయని వైద్యశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా.. మంజూరు కాలేదు. మరోవైపు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంల నియామకం చేపడతామని రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి బాధ్యతలు స్వీకరించగానే చెప్పారు. ఆ మేరకు దస్త్రంపై సంతకం కూడా చేశారు. ఇప్పటి వరకు ఆ ఫైలు ముందుకు కదలలేదు. జిల్లాలో 65 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ఉండగా.. ఒక్కో పాఠశాలకు ఇద్దరేసి చొప్పున ఏఎన్‌ఎంలను నియమించాల్సి ఉంది. ఇదే విషయమై డీఎంహెచ్‌ఓ విజయపార్వతి వద్ద ‘సాక్షి’ ప్రస్తావించగా.. పీహెచ్‌సీల్లో సరిపడా మందులు ఉన్నాయని, ఎక్కడా కొరత లేదని చెప్పారు. గ్రామాల్లో విస్తృతంగా మలేరియా పరీక్షలు చేస్తున్నామని, వైద్య శిబిరాలు చేపడుతున్నామని తెలిపారు.

క్లుప్తంగా

డీసీసీ అధ్యక్షుడిగా విద్యాసాగర్


షర్మిల నుంచి నియామక పత్రం అందుకుంటున్న మరిపి విద్యాసాగర్

బొబ్బిలి: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బొబ్బిలి నియోజక వర్గానికి చెందిన తనను ఏఐసీసీ నియమించిందని మరిపి విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాసాగర్ బొబ్బిలి నియోజకర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గతంలో పోటీ చేశారు. ఈ సందర్భంగా విజయవాడలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల తనకు నియామక పత్రం అందజేసినట్లు ఆయన ప్రకటించారు. పార్టీ అభివృద్ధికి తాను కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

భార్యాభర్తలకు తీవ్రగాయాలు


గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న మహిళ

కొత్తవలస: మండలంలోని అరకు-విశాఖ జాతీయ రహదారిలో నిమ్మలపాలెం జంక్షన్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నానికి చెందిన భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై ఎస్.కోట నుంచి విశాఖ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు తుళ్లిపోయి పక్కనే ఉన్న గోతిలో పడిపోయారు. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే వారికి సపర్యలు చేశారు. కాగా మహిళా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. భార్యాభర్తలను వైద్యం నిమిత్తం విశాఖపట్నం తరలించారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ షణ్ముఖరావు తెలిపారు.

వర్క్‌షాప్ ప్రారంభం


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న హరిశంకరన్

విజయనగరం ఫూల్‌బాగ్: మహారాజా ఫార్మశీ కళాశాలలో కరెంట్ ట్రెండ్స్ ఇన్ బయోఫారిస్టికల్స్ అండ్ ఇన్‌సిల్కో అప్లికేషన్స్ మీద మూడు రోజుల వర్క్‌షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీనియర్ డిప్యూటీ డైరెక్టర్ రిటైర్డ్ సైంటిస్ట్(హైదరాబాద్)డాక్టర్ ఎస్‌హరిశంకరన్, ప్రొఫెసర్ ఎం.రామయ్య, వైస్ ప్రిన్సిపాల్ తదతరులు ప్రసంగించారు. కార్యక్రమానికి మాన్సాస్ విద్యాసంస్థల నుంచి సుమారుగా 130 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఆకట్టుకున్న వీణ కచేరీ


వీణకచేరీ నిర్వహిస్తున్న కళాశాల విద్యార్థులు

విజయనగరం టౌన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో కొలువుదీరిన గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విదార్థులు బుధవారం సాయంత్రం గణనాథునికి వీణ కచేరీ నిర్వహించారు. వీణా వాయిద్యంలో ఐ.గౌతమి, శివాని, డి.పావని దుర్గ, వి.గణేష్‌లు అలరించారు. గణేష్ మృదంగంపై సహకరించారు. అనంతరం కాకినాడకు చెందిన ఆకుండి శ్రీనివాసరాజారావు నిర్వహించిన గాత్రకచేరీ ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. వయోలిన్‌పై ఎం.నీలాద్రి రావు, మృదంగంపై ఎం.ఏడుకొండలు సహకరించారు. కార్యక్రమాలను కళాశాల ప్రిన్సిపాల్ కేఏవీఎల్ఎన్.శాస్త్రి పర్యవేక్షించారు.

స్కూల్ గేమ్స్‌కు విద్యార్థుల ఎంపిక రేపు

సీతంపేట: స్కూల్‌గేమ్స్‌కు విద్యార్థుల ఎంపిక ఈనెల 13న చేయనున్నట్లు ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్ తెలిపారు. స్థానిక గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో 20 పాఠశాలలకు చెందిన వ్యాయమ ఉపాధ్యాయులతో సమావేశాన్ని బుధవారం ఆయన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 13న బాలికలకు, 17న బాలురకు స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమపాఠశాలలో ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నామన్నారు.

చికెన్

బ్రాయిలర్


లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210


నింగి నేలను ముద్దాడిందా? దివి నుంచి సూర్యుడు భువికి దిగి వచ్చాడా? అన్నట్లు ప్రకృతి ప్రజలను పలకరించి మంత్రముగ్ధులను చేసింది. రవివర్మ కుంచె నుంచి జాలువారిన వర్ణచిత్రాల్లా కనిపించిన ప్రకృతి దృశ్యాలను బుధవారం సాయం సంధ్య వేళ తిలకించిన నగర ప్రజలు ఆశ్చర్యచకితులయ్యారు. అస్తమిస్తున్న సూరీడి లేలేత కిరణాల సోయగాలు ట్యాంకుబండ్ రోడ్డులో గల పెద్ద చెరువు వద్ద సాక్షి కెమెరా కంటికి చిక్కాయి. ఆ రహదారిపై వెళ్తున్న ప్రయాణికులను ఆ దృశ్యాలు కట్టిపడేశాయి.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం


సొగసు చూడ తరమా..!











బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ సాయం

- రూ.లక్ష పరిహారం అందజేత

నెల్లిమర్ల రూరల్: ఇటీవల అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలో జరిగిన భారీ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నెల్లిమర్ల మండలంలోని పారసాం గ్రామానికి చెందిన గెద్ద సంతోష్ కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదంలో గాయపడిన వారికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన రూ.లక్ష చెక్కును బాధితుడి తండ్రి వెంకటరమణకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ఘటన బాధాకరమన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ బాధితులకు తమ వంతు సాయం అందించారని చెప్పారు. చనిపోయిన వారికి రూ.5లక్షలు, గాయపడిన వారికి రూ.ఒక లక్ష ప్రకటించారని, ఇచ్చిన మాట ప్రకారం సాయాన్ని అందజేశారని చెప్పారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో జగనన్న ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారన్నారు. గాయపడిన సంతోష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గదల సన్యాశినాయుడు, ఎంపీటీసీ సంగం రెడ్డి జగన్నాథం, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రోతు వెంకటరమణ, అప్పలనాయుడు, మక్కువ వెంకటరమణ, బెల్లాన రామారావు, శంకర్రావు, మక్కువ రమణ, తదితరులు పాల్గొన్నారు.


బాధితుడి తండ్రి వెంకటరమణకు చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

అభివృద్ధిని అడ్డుకోవడం తగునా..?

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన పనులు సాలూరు నియోజకవర్గంలో కొనసాగకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారని ఈ విషయంలో జిల్లా యంత్రాంగం ఎందుకు పట్టించుకోవడం లేదని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఆయనను జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కలిసి తమకష్టాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన పనులు ప్రారంభిస్తామని అధికారులను అడిగితే ఇంకా కొంతకాలం ఆగాలని పనులు ప్రారంభించడం తమ హయాంలో వద్దని పంచాయతీ రాజ్, ఐటీడీఏ తదితర శాఖల అధికారులు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీలను బలోపేతం చేస్తానని కేంద్ర నిధులు సైతం నేరుగా సర్పంచ్‌లకు లింక్ చేయిస్తానని ప్రగల్భాలు పలికారని అలాంటప్పుడు ఎందుకు కూటమి నాయకులు పంచాయతీల అభివృద్ధిని అడ్డు కుంటున్నారని ప్రశ్నించారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్ ,శివరాంపురం ఎంపీటీసీ కర్జెపల్లి త్రినాథ, సర్పంచ్ జరజాపు మోహన్ , తుండ సర్పంచ్ సీదరపు నూకయ్య,తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టిసారించాలి

విజయనగరం టౌన్: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టిసారించాలని ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ గోవిందరావు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో గత నెల 5వ తేదీ నుంచి సెప్టెంబరు 10వరకూ సాఫ్ట్ స్కిల్స్‌పై వర్క్‌షాప్‌ను ఉన్నతి ఫౌండేషన్‌తో కలిసి నిర్వహించారు. ఈ వర్క్‌షాప్ విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో ముగింపు సభను కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ శిక్షణ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్తులో ఉద్యోగావకాశాల్లో సమర్థతను పెంచుకునేందుకు, వారి జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ట్రైనర్స్‌గా శాంతిలత, ప్రత్యూషలు తరగతులను చక్కగా అందించగలిగారని ప్రశంసించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థులు ఒక ఉద్యోగానికి ఏదైనా కంపెనీకి వెళ్తే వారికి కావాల్సిన నైపుణ్యాలు ఉంటేనే తీసుకుంటారని, అందువల్ల విద్యార్థులు కచ్చితంగా ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి.సాయిదేవమణి మాట్లాడుతూ విద్యార్థులు వర్క్‌షాప్‌లో నేర్చుకున్న అంశాలను ప్రాక్టీస్ చేసి ఇంకా తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకుని భవిష్యత్తులో ఉన్నతస్థానాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ తరుణ్, అనిల్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి డాక్టర్ గోవిందరావు

కారు ఢీకొని మూడు పశువుల మృతి


మృతి చెందిన పశువులు

గంట్యాడ: కారు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో మూడు పశువులు మృతిచెందగా మరో రెండు పశువులకు గాయాలయ్యాయి. గంట్యాడ మండలంలోని కొత్త వెలగాడ గ్రామానికి చెందిన తలారి అప్పలసత్యానికి చెందిన పశువులను మదనాపురం కొండపైకి మేత కోసం తోలు కెళ్లి తిరిగి బుధవారం రాత్రి కొత్త వెలగాడ తోలుకుని వస్తుండగా మదనాపురం జంక్షన్ వద్ద విశాఖపట్నం నుంచి చినమధుపాడ వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీనిపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.సాయి కృష్ణ తెలిపారు.

సర్వజన ఆస్పత్రిలో పనిచేయని ఎక్స్‌రే

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్ కొద్ది రోజులుగా పని చేయడం లేదు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వారం రోజుల కిందట ఎక్స్‌రే మిషన్ పాడైంది. అధికారులు పట్టించుకోకపోవడంతో కొద్ది రోజులుగా రోగులకు ఇక్కట్లు తప్పలేదు. ప్రతిరోజూ ఎక్స్‌రే కోసం సుమారు 50 మంది వరకు వస్తుంటారు. వారంతా ప్రైవేట్ స్కాన్ సెంటర్లకు పరుగులు తీయాల్సి వస్తోంది. ఇదే విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు వద్ద సాక్షి ప్రస్తావించగా ఒకటి, రెండు రోజుల్లో ఎక్స్‌రే మిషన్‌కు మరమ్మతులు చేయిస్తామన్నారు.

రోటరీ చెస్ పోటీలకు 214 మంది హాజరు


విజేతలను అభినందిస్తున్న రోటరీ క్లబ్ విజయనగరంసెంట్రల్ ప్రతినిధులు

విజయనగరం: రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవతరోత్సవ్‌లో భాగంగా బుధవారం నిర్వహించిన చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు అనూహ్య స్పందన లభించింది. యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు నిర్వహిస్తున్న పోటీల్లో భాగంగా బుధవారం పోటీలకు జిల్లా నలుమూలలనుంచి 214 మంది హాజరయ్యారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన పోటీలను నవతరోత్సవ్‌ను చైర్మన్ జయకృష్ణ, మంచుకొండ అశోక్‌లు ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా ఇప్పటి వరకు మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించామని, మరో 12 విభాగాల్లో యువతకు పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నిర్వహించే పోటీల్లో విద్యార్థులు, యువత పాల్గొని విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కార్యదర్శి శంకర్‌రెడ్డి, రామకృష్ణ, ఉదయ్, మారుతీ, టీఎల్ఎన్ మూర్తి, నయన, సుమంత్, విజయనగరం చెస్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి తదితరులు పాల్గొన్నారు.

వసంత గెడ్డలో వ్యక్తి గల్లంతు

- గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్

గంట్యాడ: మండలంలోని చంద్రంపేట, వసంత గెడ్డలో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళితే ఎల్. కోట మండలం సందులూరుకు చెందిన అప్పబత్తుల సతీష్(30) అతని భార్య వరలక్ష్మి తో కలిసి అత్తవారి గ్రామం అయిన చంద్రంపేటకు బుధవారం వచ్చారు. తిరిగి సందులూరు వెళ్తుండగా చంద్రంపేట, వసంత గ్రామాల మధ్యలో ఉన్న గెడ్డ దాటుతుండగా బండి స్లిప్ అవడంతో సతీష్ కింద గెడ్డలోకి జారిపోయి గల్లంతయ్యాడు. అతని భార్య వరలక్ష్మి కింద పడిన వెంటనే బండిని పట్టుకుని ఉండిపోవడంతో సురక్షితంగా బయటపడింది.

ముమ్మరంగా గాలింపు

సతీష్ గల్లంతైన వెంటనే చంద్రంపేట గ్రామస్తులు అక్కడికి చేరుకుని గాలించడం మొదలు పెట్టారు. ఈలోగా విషయం తెలుసుకుని ఆర్‌డీఓ ఆర్‌వీ సూర్యకళ, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంపీడీఓ భవాని, ఎస్సై సాయికృష్ణ అక్కడికి చేరుకుని ఎస్‌డీఆర్‌ఎఫ్‌ను రప్పించారు. స్థానికులు గాలించినప్పటికీ అచూకీ లభ్యం కాకపోవడంతో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం గాలింపు చేపట్టింది. రాత్రివరకు అచూకీ లభ్యం కాలేదు. ఆర్‌డీఓ సూర్యకళ గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్నారు.


గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం


గల్లంతైన సతీష్ (ఫైల్)

గోతిలో తిరగబడిన లారీ

బొబ్బిలి రూరల్: మండల పరిధిలోని పిరిడి జంక్షన్ నుంచి గొల్లపల్లికి వచ్చే ప్రధాన రహదారిపై కర్రల లోడుతో వెళుతున్న లారీ గోతిలో పడి తిరగబడింది. బుధవారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్పగాయాలు కాగా భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఉదయం సంఘటన జరగ్గా మధ్యాహ్నానికి భారీక్రేన్లతో లారీని పక్కకు తొలగించారు.రహదారి వెంబడి వాహనాల రాకపోకలు నిలిచిపో యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురైయ్యారు.విషయం తెలుసుకున్న బొబ్బిలి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు.పారాది గ్రామం వద్దనున్న ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోగా,పాత బ్రిడ్జిపైనుంచి 10 టన్నులకు మించి బరువున్న వాహనాలను అనుమతించడం లేదు.దీంతో ఈరహదారిపై వెళుతున్నభారీ వాహనాల కారణంగా పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి.ఫలితంగా ఎక్కువ బరువున్న వాహనాలు గోతుల్లోకి దిగి బోల్తాపడుతున్నాయి.ఈ పరిస్థితుల్లో ఆరోజంతా వాహనదారులకు ఇక్కట్లు తప్పడంలేదు.ఉదయం జరిగిన ఈసంఘటనతో ఆయా గ్రామాలనుంచి పట్టణానికి చదువుకోసం వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురై నడుచుకుంటూ చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు,పాలకులు రోడ్ల మరమ్మత్తులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు,వాహనదారులు కోరుతున్నారు. ప్రతి సారీ ఇటువంటి సంఘటనలు పునరావృతం అవుతున్నప్పటికీ ఈ రహదారి బాగుకు చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

పీహెచ్‌సీ వైద్యుల నిరసన

- నల్ల రిబ్బన్లతో విధులకు హాజరు
- దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేయనున్న వైద్యులు
- క్లినికల్ కోటా 30 శాతం, నాన్ క్లినికల్ కోటా 50 శాతం పెంచాలని డిమాండ్

విజయనగరం ఫోర్ట్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల్లో పనిచేసే వైద్యులు పీజీ వైద్య విద్యను అభ్యసించేందుకు ఇచ్చే ఇన్ సర్వీస్ కోటాను ప్రభుత్వం తగ్గించడంతో వారంతా ఉద్యమబాట పట్టారు. తమ డిమాండ్ నేరవేర్చకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. గతంలో ఉన్న ఇన్ సర్వీస్ కోటాను తగ్గించడం పట్ల మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులు బుధవారం నల్లరిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. ప్రభుత్వం స్పందించకుంటే 18వతేదీ నుంచి నిరవధిక నిరహార దీక్షలకు దిగుతామని స్పష్టం చేస్తున్నారు.

ఇన్‌సర్వీస్ కోటా తగ్గింపు

పీహెచ్‌సీ వైద్యులకు పీజీ వైద్యవిద్యలో ఇన్ సర్వీస్ కోటాను ప్రభుత్వం తగ్గిస్తూ జీఓ నంబర్ 85ను జారీ చేసింది. గతంలో ఇన్ సర్వీస్ కోటా క్లినికల్ 30 శాతం ఉంటే దాన్ని 15 శాతానికి తగ్గించారు. నాన్ క్లినికల్ కోటాను 50 శాతం నుంచి 30 శాతానికి తగ్గించారు. గతంలో మాదిరి క్లినికల్ కోటాను 30 శాతానికి, నాన్ క్లినికల్ కోటాను 50 శాతానికి పెంచాలని వైద్యులు కోరుతున్నారు. ఇన్‌సర్వీస్ కోటా తగ్గిస్తూ ఇచ్చిన జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ ఆకస్మాత్తుగా జీఓ ఇవ్వడం అన్యాయమని వాపోతున్నారు. ఈజీఓ వల్ల తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీఓను రద్దు చేయాలని పాలకులు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ స్పందన లేక పోవడంతో ఆందోళనకు దిగారు.


పెదమజ్జిపాలెం పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జీతో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు


రాకోడు పీహెచ్‌సీలో నల్లబ్యాడ్జితో వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యురాలు

జీఓ 85 రద్దు చేయాలి



ఇన్ సర్వీస్ కోటాను తగ్గిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓ నంబర్ 85ను రద్దు చేయాలి. ఇన్ సర్వీస్ కోటా క్లినికల్ 30 శాతం , నాన్ క్లినికల్ 50 శాతం యథాతథంగా అమలు చేయాలి. ఇన్ సర్వీస్ కోటాను తగ్గిస్తే నష్టం కలుగుతుంది.

డాక్టర్ వెంకటేష్, గంట్యాడ పీహెచ్‌సీ, వైద్యుడు

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా పోస్టల్ శాఖ ఏఎస్పీ సుందరనాయుడు


మాట్లాడుతున్న పోస్టల్ ఏఎస్పీ సుందరనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: తపాలా సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్‌శాఖ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ పి. సుందరనాయుడు అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌వీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో 'జనంలోకి మనం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోస్టల్ శాఖ ద్వారా ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నామన్నారు. తక్కువ ఖర్చుతో ఇన్సూరెన్స్ పాలసీలు అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఆధార్‌కార్డులు, ఫోన్‌లింక్, పేరుమార్పులతో పాటు వివిధ రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో పోస్టల్ సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. సుకన్య సమృద్ధి యోజన, మహిళాసేవింగ్ సమ్మాన్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సేవింగ్ బ్యాంక్ అకౌంట్, సీనియర్ సిటిజన్ స్కీమ్, తదితర పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ సత్తిబాబు, పూసపాటిరేగ సబ్ పోస్ట్‌మాస్టర్ రాంబాబు, ప్రిన్సిపాల్ పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను,పేషెంట్స్‌ను,చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ : 18K. Ph: 9640528899, 9640648899 [H-796196]

కష్టపడేవాళ్ళు కావలెనుVIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు, ఫ్రీ రూమ్+భోజనం.HYD. 9182260297. [HA-98406]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.